epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 141 | శనివారం | 26.10.2024



బీఆర్ఎస్, కాంగ్రెస్

## బాహాబాహీ

- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో రభస
- సముదాయించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



**జనగామ, మన చౌరాస్తా :** జనగామలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ గందరగోళం సృష్టించారు. జనగామ జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై సీఎం రేవంత్ రెడ్డి ఫొటో లేదని కాంగ్రెస్ కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.1,00,116 తో పాటు తులం బంగారం పథకం ఏమైందంటూ.. బీఆర్ఎస్ కౌన్సిలర్లు కౌంటర్ అటాక్ చేయడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ నాయకులు ఒక్కసారిగా వేదిక ముందుకు వచ్చి గొడవకు దిగడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. జై కాంగ్రెస్.. జై బీఆర్ఎస్.. అంటూ పోటాపోటీగా ఇరు వర్గాల నినాదాలు చేశారు. దీంతో పోలీసులు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇరు వర్గాలకు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

### తులం బంగారంపై అసెంబ్లీలో ప్రశ్నిస్తా..

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



3 లో



విద్యార్థులకు చదువుపై

### ఆసక్తి పెంచాలి

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

3



రక్తదానం చేసి

### ప్రాణదాతలు కండి

- డీసీపీ రాజమహేంద్ర నాయక్

3



పాలకుర్తి నియోజకవర్గ

### అభివృద్ధే నా లక్ష్యం

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

2

మన చౌరాస్తా
2
26.10.2024 శనివారం
epaper.manachourasta.com

General News



# చదువుపై ఆసక్తి పెంపొందించాలి

■ **జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా**

**నర్మెట, మన చౌరాస్తా :** విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంపొందించుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ నర్మెట్ట మండలంలో పర్యటించి కేజీబీవీ తరగతి గదులను, మోడల్ హై స్కూల్ భోజనశాల ను సందర్శించి నిర్వహణ తీరును పర్యవేక్షించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కేజీబీవీ విద్యార్థులకు కావలసిన అదనపు గదులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ 100 శాతం ఫలితాలు సాధించాలని, విద్యార్థులు విద్యపై ఆసక్తి పెంపొందించుకొని ఇష్టతతో చదవాలని 10 / 10 సాధించాలని జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తూ, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఉత్తమ ఫలితాలు రాబట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి, మీ సేవ పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. ఎల్ఆర్ఎస్ కింద అందించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కలెక్టర్ వెంట విద్యాశాఖ అధికారి రాము, మండల విద్యాశాఖ అధికారి అయిలయ్య, నర్మెట్ట తహసీల్దార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.




# రెవిన్యూ డివిజన్‌తోనే చేర్యాల ప్రాంతం అభివృద్ధి

**చేర్యాల, మన చౌరాస్తా :** సిపిఎం పార్టీ తాడూరు గ్రామ శాఖ మహాసభ నూకల కనకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి సిపిఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్ మావో మాట్లాడుతూ చేర్యాల రెవిన్యూ డివిజన్ కేంద్రంగా సాధించుకున్న నాడే చేర్యాల ప్రాంతం అభివృద్ధి చెందుతుందని సిపిఎం శ్రేణులు అందరూ రెవిన్యూ డివిజన్ సాధనలో ముందుండాలని అన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు బద్దిపడగ కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా చేర్యాల ప్రాంతం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని మన పాలకులు కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం వహిస్తూ చేర్యాల ప్రాంతంపై ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా వ్యవరించారాని ఆరోజు పోరాటంలో ఉన్న కాంగ్రెస్ నేడు అధికారంలో ఉన్నారని అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే రెవెన్యూ డివిజన్ ప్రకటిస్తామని ఎన్నికలలో నేటి ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ రెవెన్యూ డివిజన్ మాట ఎత్తడం లేదని, ఇంకోపక్క అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జేఏసీగా ప్రకటించుకుని రెవిన్యూ డివిజన్ కోసం పోరాడుదాం అని పిలుపునివ్వడంలో ఏమాత్రం అర్థం లేదని అన్నారు. జేఏసీ పేరుతో కాలయాపనం చేస్తే సిపిఎం పార్టీ శ్రేణులు సహించరని చేర్యాల ప్రాంత ప్రజలను ఏకం చేసి ప్రజా సంఘాలతో, మేధావులతో అందర్నీ కలుపుకొని పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. సమావేశంలో సిపిఎం పార్టీ ముఖ్య కార్యదర్శిగా ఈరి సిద్దయ్య ను ఎన్నుకోవడం జరిగింది సోషల్ మీడియా చార్జిగా నూకల మహేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు గొర్రె శ్రీనివాస్, మక్కని ఎల్లయ్య, నర కృష్ణారెడ్డి, చెరుకు సాయిలు, చెరుకు యాదగిరి నరసయ్య, లింగం, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

■ **ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్య**

**జనగామ, మన చౌరాస్తా :** ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయలు తక్షణమే విడుదల చేయాలని డిప్యూటీ తహసీల్దార్ జగన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మెమోరండం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.8,300 కోట్ల స్కాలర్షిప్, ఫీజు మెంబర్స్ మెంట్లు విడుదల చేయాలన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడం అద్దె భవనాల్లో ఉంటూ విద్యార్థులకు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, అనేకమార్లు చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారం చూపకుండా ఉంటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను నియోజకవర్గ ఇంచార్జులను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనాథ్, రవి, రాకేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# వికలాంగుల చట్టం పోస్టర్ ఆవిష్కరణ

**జనగామ, మన చౌరాస్తా :** 2016 చట్టంలోని 91, 92 సెక్షన్ల ప్రాముఖ్యతను వివరించే పోస్టర్లను జనగామ కలెక్టర్ షేక్ రాజ్వాన్ బాషా శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ వికలాంగుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల సమ్మయ్య మాట్లాడుతూ సమాజంలో వికలాంగుల పట్ల సాను భూతి చూపడం కాదు.. సహానుభూతి అనగా సాటి మనిషిగా గుర్తించాలన్నారు. వికలాంగుల హక్కుల చట్టం గురించిన అవగాహన లేని కొందరు తమ పట్ల హేళనగా మాట్లడుతున్నారని ఇది సరికాదన్నారు. అలాంటి వారికి 92 సెక్షన్ ప్రకారం ఆరు నెలల నుంచి 5 సంవత్సరాల జైలు శిక్షతో పాటు భారీ జరిమాన విధింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొట్ల సుమతి, జిల్లా ప్రధాన కార్యదర్శి చీటకోడూరు ఐలేష్, చిలివేరి సంపత్, మెరుగో జు సుధాకర్, మోటే మల్లేష్, స్వరూప, సత్తిరెడ్డి, ప్రవీణ్ కుమారు తదితరులు పాల్గొన్నారు.



# నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి

చేర్యాల, మన చౌరాస్తా : జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ రెడ్డి ఏర్పాటు చేసిన జిల్లా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం జిల్లా డిఐఈఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సరైన విద్యను అందించాలని విద్యతో పాటు, మంచి నైతిక విలువలను పెంపొందించాలని విద్యార్థులను చెడు వ్యసనాల బారిన పడకుండా చూడవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని,ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం చేర్యాల ప్రైవేటు జూనియర్ ఒకేషనల్ కళాశాల యజమాన్యం డి ఐ ఈ ఓ రవీందర్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా పుష్పగుచ్చం ఇచ్చి ఆయనను సత్కరించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లు పంతుల శివ శంకర్,బెజాడి రామ్ రెడ్డి,మన్నె సత్య వర్ధన్ పాల్గొన్నారు.

# అభివృద్దే నా లక్ష్యం : యశస్వినిరెడ్డి

**పాలకుర్తి , మన చౌరాస్తా :** సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేసి పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిందని, తాజాగా గ్రామాల అభివృద్ధికి సీఆర్ఆర్ నుండి రూ.22 కోట్లు, తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం టీఎఫ్ సీడీ నుండి రూ.5 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని, పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు.

Local News



# రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

■ **డీసీపీ రాజమహేంద్ర నాయక్**

**జనగామ, మన చౌరాస్తా :** త్యాగానికి ప్రతీకైన రక్తదానం చేసే దాతలు అందరూ ప్రాణ దాతలని జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. శుక్రవారం ఉదయం వెస్ట్ జోన్ వరంగల్ పోలీస్ కమిషనరేట్, జనగామ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ, జనగామ రక్త నిధి సంయుక్త ఆధ్వర్యంలో జూబ్లీ పంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తాను స్వయంగా రక్తదానం చేసి ప్రారంభించిన ఈ శిబిరంలో నర్మెట సీఐ అబ్బయ్య, స్థానిక ఎస్సైలు రాజేష్ , చెన్నకేశవులు, పలువురు పోలీస్ సిబ్బంది యువకులు, లయన్స్ క్లబ్బుల ప్రతినిధులు పాల్గొని 221 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు స్థానిక ఏసీపీ పార్థసారథి అధ్యక్షత వహించగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ పి.దామోదర్ రెడ్డి స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ 1960 నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సలు నిర్వహిస్తూ ఈ సందర్భంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం సాంప్రదాయంగా వస్తున్నదన్నారు. ఒకరు రక్తదానం చేయడం వల్ల సుమారు ఐదుగురు అవసరార్థులను ఆదుకోవచ్చునన్నారు. రక్త దానం చేయడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉండడమే కాకుండా తద్వారా లభించే శారీరక ఫలితాల గురించి



జనగామ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సీనియర్ డాక్టర్ డి.లవకుమార్ రెడ్డి వివరించారు. రక్తదానం పట్ల ఉన్న అపోహల గురించి వివరిస్తూ ప్రతి ఒక్కరూ రక్త దానం చేసే అలవాటు అలవర్చుకోవాలని రెడ్ క్రాస్ నాయకుడు డాక్టర్ సి.హెచ్ రాజమౌళి సూచించారు. ఇంకా ఈ సమావేశంలో రెడ్ క్రాస్ కార్యదర్శి లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు, నర్మెట్ట సీఐ అబ్బయ్య, జనగామ బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారులు డాక్టర్ పి.కరుణాకర్ రాజు, ఎం.దివ్య తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్సైలు భరత్, శ్వేత, హమీద్, రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్‌ల నాయకులు, పురప్రముఖులు కృష్ణ జీవన్ బజాజ్, శ్రీరాం శ్రీనివాస్, ఏ.నర్సిరెడ్డి, వై.సంజీవరెడ్డి, డా. డి.శివశంకర్ రావు, గాదె నర్సింహులు, లోకమంతా రెడ్డి, జక్కుల వేణుమాధవ్, శ్రీనివాస్ రెడ్డి, కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way



'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812



# అందరికీ సంక్షేమ పథకాలు

■ **జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి.**

**చేర్యాల, మన చౌరాస్తా :** ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు అందేలా చూస్తానని, ఈ విషయంలో లబ్ధిదారులు ఎవరు ఒక్క పైసా ఖర్చు పెట్టుకోవాల్సిన అవసరం లేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రేణుక గార్డెన్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. చేర్యాల పట్టణంతో పాటు చేర్యాల మండలంలోని వివిధ గ్రామాలు, దూలిమిట్ట, కొమురవెల్లి మండలాలకు చెందిన 64 మంది లబ్ధిదారులకు 17 లక్షల 94,500 రూపాయల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పెద్ద మొత్తంలో పంపిణీ చేశామని ఈ ప్రభుత్వ హయాంలో నత్త నడకన జరుగుతుందని అన్నారు. పది నెలల కాలంలో 700 చెక్కులు పంపిణీ చేశామని తాను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ఉన్న సమయంలో 450 చెక్కులు ఇచ్చామని మిగిలిన చెక్కులను తాను ఎమ్మెల్యేగా అయినప్పటినుండి ఇప్పటివరకు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించాలని ప్రతిక్షణం వారి సేవలో ఉంటానని అన్నారు. సంక్షేమ పథకాల విషయంలో ఒక్క పైసా ఖర్చు పెట్టవలసిన అవసరం లేదని ఆయన ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## తులం బంగారంపై అసెంబ్లీలో ప్రశ్నిస్తా

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** కళ్యాణలక్ష్మి లబ్దదారులకు తులం బంగారం అడుగుతున్నారని, ఈ విషయాన్ని అసెంబ్లీ ప్రశ్నిస్తానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. తహసీల్దార్ మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ఎవరైనా కూడా ప్రోగ్రాం ఏది ఇచ్చారో అది మాత్రమే ఫాలో కావాలని, ప్రోటోకాల్ కావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వాళ్లు అధికారులను ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణ చందర్, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, మండల అధ్యక్షుడు బోడిగం చంద్రరెడ్డి, మండల మహిళ అధ్యక్షురాలు, పిఎసిఎస్ డైరెక్టర్ మద్దికుంట రాధరెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్లు చందు, లక్ష్మన్ గౌడ్, మాజీ సర్పంచుల పోరం మండల అధ్యక్షుడు గంగం సతీష్ పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్స్ కోసం వినతి

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి మురళీకృష్ణ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ , ఫీజు రీయింబర్స్మెంట్ రూ.8,300 కోట్ల బకాయిలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు గోపాల్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బచ్చన్నపేట మండల కార్యదర్శి మురళి కృష్ణ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులతో చలగాటం ఆడుతోందని అన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్, నిఖిల్, శ్రీధర్, ఆనంద్, వెంకటేష్ పాల్గొన్నారు.

# అలియా ఆగ్రహం..

మన చౌరాస్తా, సినిమా : బాలీవుడ్ ఇండస్ట్రీలోనే వన్ ఆఫ్ ది టాప్ హీరోయిన్ అలియా భట్. అద్భుతమైన నటనకు ఉత్తమ నటిగా జాతీయ అవార్డు గెలుచుకుంది. స్టూడేంట్ ఆఫ్ ది ఇయర్ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టిన అలియా.. ఇప్పటివరకు ఎన్నో హిట్ చిత్రాల్లో నటించింది. బీటౌన్ హీరో రణబీర్ కపూర్‌తో వివాహం.. పాప జన్మించిన తర్వాత కూడా సినిమాల్లో బిజీగా ఉంటుంది ఈ బ్యూటీ. అయితే కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో అలియా ముఖంలో వచ్చిన మార్పుల గురించి అనేక వార్తలు వైరలవుతున్నాయి. అలియా ముఖం ఒకప్పటిలా లేదని.. ఆమె చిరునవ్వు, మాట్లాడే తీరు మారిపోయిందని.. ఆమె ముఖానికి సర్జరీ చేయించుకుందని రూమర్స్ వినిపించాయి. అయితే ఈ వార్తలకు మరింత బలం చేకూరుస్తూ ఇటీవల ఓ కాస్మొటాలజిస్ట్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. ఓ కాస్మెటిక్ సర్జన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అలియా భట్ ఫొటోలు చూస్తుంటే, ఆమెకు ముఖ పక్షవాతం వచ్చినట్లు అనిపిస్తుందని.. ఆమె నవ్వు వంకరగా ఉంటుందని.. ఆమె బొటాక్స్ (కాస్మెటిక్ సర్జరీ) చేయించుకున్నట్లు కనిపిస్తోందని.. అది సక్సెస్ కాకపోవడంతో ఆమెకు ముఖ పక్షపాతం వచ్చినట్లు అనిపిస్తుందని.. ఇలాగే తన వద్దకు వచ్చిన చాలా మందికి జరిగిందని.. ఆ సమస్యకు చికిత్సతో నయం చేయొచ్చు అంటూ కామెంట్స్ చేశాడు. దీంతో ఆ కాస్మోటిక్స్ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్స్ అలియా పాత పొటోలు, ప్రస్తుత ఫొటోస్ పోల్చి చూస్తు ఆమెకు ముఖ పక్షపాతం వచ్చిందని కామెంట్స్ చేశారు. తాజాగా తన గురించి వస్తున్న వార్తలపై అలియా రియాక్ట్ అయ్యింది. 'ఏంటీ.. తమాషాలు చేస్తున్నారా..? కాస్మోటిక్స్ ట్రీట్మెంట్ తీసుకున్నట్లు ఏమైనా ప్రూఫ్స్ ఉన్నాయా.. ? నా గురించి వస్తున్న వార్తలను నేను నమ్మలేకపోతున్నాను. మీరు ఒక వ్యక్తి ముఖం ఎలా మాట్లాడుతున్నారు. అలాగే చికిత్స అంటూ వివరణలు ఇస్తున్నారు. నేను పక్షవాతంతో బాధపడుతున్నానా.. ఎలాంటి ఆధారాలు, సాక్ష్యాలు లేకుండా నా గురించి ఎలా స్టేట్మెంట్ ఎలా ఇచ్చారు. ఇదంతా కేవలం పాపులారిటీ కోసం, వ్యూస్ కోసమే చేస్తున్నారు. డబ్బు సంపాదించడానికి ఇలాంటి కామెంట్స్ చేస్తున్నారు. స్త్రీ శరీరం, ముఖం, వ్యక్తిగత జీవితం గురించి ఇలా నీచంగా మాట్లాడేవారిపై మనం గళం విప్పాలి. ఇలా మన శరీరాల గురించి మాట్లాడేవారు హనికరం' అని అన్నారు అలియా.

